జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

శనివారం | 03-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 799 పేజీలు: 4 వెల: రూ.7

# కిడ్నీ ఆసుపత్రి పరిసరాల్లో.. భూబాగోతం

- పెరిగిన భూముల ధరలతో జిరాయితీ స్థలాలపై కన్ను
- 44 మూరల స్థలంపై వివాదం
- రూ.43 లక్షలకు విక్రయ యత్నం
- రూ.13 లక్షల అడ్వాన్స్ వ్యవహారంపై కలకలం

పలాస, అక్టోబర్2 (వార్త): పలాస కిడ్నీ ఆసుపత్రి పరిసరాల్లో భూముల ధరలు భారీగా పెరగడంతో ఖాళీగా ఉన్న జిరాయితీ స్థలాలపై కొందరి కన్ను పడిందన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మందస మండలానికి చెందిన సోమయ్య మేస్త్రికి సంబంధించినదిగా చెబుతున్న తాలూకా సర్వే నంబర్లు 252, 253/సిలోని సుమారు 44 మూరల స్థలం చుట్టూ నెలకొన్న వివాదం ఇప్పుడు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. స్థలం యాజమాన్యం, పత్రాల చెల్లుబాటు, పొజిషన్ సర్టిఫికెట్ వ్యవహారం, రూ.13 లక్షల అడ్వాన్స్, రూ.43 లక్షల విక్రయ యత్నం వంటి అంశాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి.

## పదేళ్లుగా ఖాళీ.. ఇప్పుడు ఎందుకింత ఆసక్తి?

సుమారు పదేళ్ల క్రితం సోమయ్య మేస్త్రి ఈ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. అప్పటి నుంచి స్థలం ఖాళీగా ఉండటంతో దానిపై కొందరు వ్యక్తులు కన్నేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమి విలువ పెరిగిన తర్వాతే ఈ స్థలంపై వివాదం తెరపైకి రావడం పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. గతంలో ఆ పరిసరాల్లో కొందరి బంధువుల పేర్లతో అడంగల్‌లో నమోదైన భూములను ఇప్పటికే ఇతరులకు విక్రయించినట్లు సమాచారం. అయితే పాత పేర్లు అడంగల్‌లో కొనసాగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని ప్రస్తుత కొనుగోలుదారులపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై అధికారిక రికార్డులు ఏమి చెబుతున్నాయన్నది తేలాల్సి ఉంది.

## పొజిషన్ సర్టిఫికెట్ వెనుక అసలు కథ ఏమిటి?

పదేళ్లుగా ఖాళీగా ఉన్న స్థలంపై కొందరు వ్యక్తులు హక్కులు కోరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కొందరు విలేకరులు, మరికొందరు రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్న వ్యక్తుల పేర్లు ప్రచారంలోకి రావడం చర్చనీయాంశమైంది. గతంలో పలాసలో పనిచేసిన తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తిపై ఒత్తిడి తెచ్చి పొజిషన్ సర్టిఫికెట్‌కు సంబంధించిన పత్రాలు పొందినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆ పత్రాలు ఏ ప్రాతిపదికన జారీ అయ్యాయి? దరఖాస్తు ఎవరు చేశారు? పరిశీలించిన రికార్డులు ఏమిటి? సంబంధిత అధికారుల నివేదిక ఏమిటి? అన్నది అధికారికంగా తేలాల్సి ఉంది. ఆ పత్రాలను చూపిస్తూ స్థలం తమదేనంటూ అసలు యజమానిగా పేర్కొంటున్న వ్యక్తిపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక స్థలంలో వేసిన పునాదిని కూడా తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో బాధితుడు భయాందోళనకు గురైనట్లు సమాచారం.

## రూ.43 లక్షల డీల్.. రూ.13 లక్షల అడ్వాన్స్..

ఈ వివాదం కొనసాగుతుండగానే ఓ విలేకరి ఈ స్థలాన్ని భిలాయ్‌లో నివసిస్తున్న తన సమీప బంధువులకు సుమారు రూ.43 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఇందులో భాగంగా రూ.13 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు ప్రచారం కూడా ఉంది. మిగిలిన మొత్తాన్ని స్థలంలో పునాది వేసిన అనంతరం చెల్లించేలా ఒప్పందం కుదిరిందన్న ప్రచారం స్థానికంగా చక్కర్లు కొడుతోంది. అయితే అడ్వాన్స్ వ్యవహారంలో సంబంధిత వ్యక్తుల మధ్య విభేదాలు తలెత్తడంతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ఈ లావాదేవీకి సంబంధించిన రాతపూర్వక ఒప్పందం, చెల్లింపుల ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు అధికారికంగా బయటకు వస్తేనే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## టెక్కలిలో రిజిస్ట్రేషన్ వెనుక ఆంతర్యం ఏమిటి?

జిరాయితీ భూమి అయితే అన్ని అనుమతులు ఉంటే పలాసలో చేయవలసిన రిజిస్ట్రేషన్ టెక్కలి ఎందుకు చేయవలసి వచ్చిందన్న అనుమానాలకు దారితీస్తుంది. తన భూమిపై జరుగుతున్న పరిణామాలపై ఆందోళన చెందినట్లు చెబుతున్న సోమయ్య పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి తన వద్ద ఉన్న భూ పత్రాలు, హక్కులకు సంబంధించిన వివరాలను వివరించినట్లు సమాచారం. బాధితుడి వాదనను విన్న ఎమ్మెల్యే భూమి విషయంలో న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇటువంటి వ్యవహారాలకు అడ్డుకట్ట వేస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎక్కడ?

ఈ వివాదంలో పలు కీలక ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. 44 మూరల స్థలానికి అసలు హక్కుదారు ఎవరు? రూ.43 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించింది ఎవరు? రూ.13 లక్షల అడ్వాన్స్ ఎవరి నుంచి ఎవరికీ వెళ్లింది? ఆ లావాదేవీకి ఆధారాలున్నాయా? పొజిషన్ సర్టిఫికెట్ ఏ ఆధారాలతో జారీ అయింది? దాని కోసం ఎవరు దరఖాస్తు చేశారు? స్థలంలో పునాది ఎవరు వేశారు? దాన్ని ఎవరు తొలగించారు? అడంగల్‌లోని పాత పేర్లకు ప్రస్తుత హక్కులకు సంబంధం ఏమిటి? ఈ ప్రశ్నలకు అధికారిక సమాధానాలు లభిస్తేనే వివాదం వెనుక ఉన్న అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## రికార్డులే తుది తీర్పు

భూ వివాదాల్లో మాటలు, ఆరోపణలు, ప్రచారాల కంటే ప్రభుత్వ రికార్డులే కీలకం. సంబంధిత అధికారులు తాలూకా సర్వే నంబర్లు 252, 253/సికి సంబంధించిన పాత, ప్రస్తుత అడంగల్ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు, హక్కు పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్, భూమి స్వభావం, పన్నుల చెల్లింపులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సమగ్ర విచారణ జరిగితేనే ఈ భూ బాగోతం వెనుక దాగి ఉన్న అసలు కథ బయటపడే అవకాశం ఉంది.



# స్వచ్ఛత.. సామాజిక బాధ్యత

- పారిశుధ్యంతోనే ఆరోగ్యకర సమాజం
- పారిశుధ్య కార్మికులకు గౌరవం ఇవ్వాలి
- చెత్తను కుండీల్లోనే వేయాలి.. రోడ్లపై, కాలువల్లో కాదు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్
- అంబేడ్కర్ ఆడిటోరియంలో స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం

శ్రీకాకుళం, అక్టోబర్2 (వార్త): పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ స్థాపనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మసలుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర అవార్డులు - 2026' జిల్లా స్థాయి ప్రదానోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. "స్వచ్ఛత అనేది కేవలం మున్సిపాలిటీ లేదా పంచాయతీల బాధ్యత మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. విదేశాల్లో వారానికి రెండు సార్లు మాత్రమే చెత్త సేకరిస్తే, మన దగ్గర ప్రతిరోజూ ఇంటింటికీ వచ్చి సేకరిస్తున్నారు. ఉదయాన్నే నాలుగింటికి లేచి పనికి వచ్చే పారిశుధ్య కార్మికులకు మనం తగిన గౌరవం ఇవ్వాలి. చెత్తను కాలువలు, రోడ్లపై వేయకుండా ఇళ్లలోని చెత్తకుండీల్లోనే వేయాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, ఆలయ ప్రాంగణాలు.. ఇలా ప్రతి చోటా స్వచ్ఛత ప్రతిబింబించాలి. సౌర విద్యుత్ వినియోగం, ఇంకుడు గుంతల నిర్వహణ ద్వారా పర్యావరణ సమతుల్యత సాధిస్తూ ముఖ్యమంత్రి ఆకాంక్షించిన 'నెట్ జీరో' లక్ష్య సాధనకు కృషి చేయాలి" అని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 'మహాత్మా గాంధీ ఆనాడే స్వచ్ఛ భారత్ కలలు కని స్వయంగా ఊడ్చడం ప్రారంభించారని, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో రాష్ట్రంలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర', 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాలు దిగ్విజయంగా సాగుతున్నాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆలోచనలు, కలెక్టర్ ప్రత్యేక చొరవ, మున్సిపల్ అధికారుల కృషితో శ్రీకాకుళంలోని కార్గిల్ పార్క్ రాష్ట్రంలోనే నంబర్ వన్ పార్క్‌గా నిలవడం గర్వకారణం. ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలు భాగస్వాములైతేనే సంపూర్ణ స్వచ్ఛత సాధ్యమవుతుంది" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు సిబ్బందికి పెద్దల చేతుల మీదుగా 5 రాష్ట్ర స్థాయి, 65 జిల్లా స్థాయి ప్రశంసా పత్రాలు, పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వరూప రాణి, జెడ్పీ సీఈవో వెంకటరామన్, డి ఆర్ డి ఏ పి డి కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# రైళ్లలో మొబైల్ చోరీల ముఠా గుట్టురట్టు

**- ఇద్దరి అరెస్టు..10 ఫోన్లు స్వాధీనం**

**పలాస, అక్టోబరు 2 (వార్త):** రైళ్లలో ప్రయాణికుల మొబైల్ ఫోన్లను అపహరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పలాస రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిర్వహించిన తనిఖీల్లో ఈ చోరీల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఖలికోట పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన జగన్ బెహెరా, బుండబన జాలి రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని మొబైల్ ఫోన్లను చోరీ చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఖలికోట-పలాస-శ్రీకాకుళం రైల్వే మార్గంలో రద్దీ సమయాలను గమనించి, ప్రయాణికుల దృష్టి మరలిన సమయంలో ఫోన్లను అపహరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 10 ఫోన్లలో కొన్ని గతంలో నమోదైన చోరీ కేసులకు సంబంధించినవిగా గుర్తించినట్లు తెలిపారు. వాటిని సాంకేతికంగా పరిశీలించి అసలు యజమానులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. విశాఖపట్నం రైల్వే లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ ఆదేశాల మేరకు పలాస జీఆర్పీ ఎస్ఐ దుంపల శ్రీనివాసరావు, క్రైమ్ డిటెక్షన్ బృందం సిబ్బంది ఎం.సంతోష్‌కుమార్, బి.దేవేంద్రనాథ్, పలాస ఆర్‌పీఎఫ్/సీపీడీఎస్ ఎస్ఐ టి.నిఖిల్‌కుమార్, సిబ్బంది రాజులకుమార్, సీహెచ్.శంకర్, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## సరుబుజ్జిలిలో గ్రామసభ..గాంధీ జయంతి



**సరుబుజ్జిలి, అక్టోబరు 2(వార్త):** సరుబుజ్జిలి గ్రామ పంచాయతీలో గురువారం గ్రామసభ, గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామంలోని వివిధ సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించడం జరిగింది. ముఖ్యంగా పల్లె పండుగ 3.0 కి సంబంధించి చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులను గుర్తించారు. గుర్తించిన పనులకు అంచనాలు తయారీపై చర్చించారు. వీధిలో విద్యుత్ లైట్లు, శానిటైజేషన్ ఇంకా ఎవరైనా గ్రామస్తులు కొత్త పనులు గుర్తించిన యెడల, వాటిని కూడా తీర్మానంలో పొందుపరిచి ప్రభుత్వానికి పంపేలా నిర్ణయం తీసుకోవడం జరిగింది. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇల్లాకుల ప్రభాకర్, యువ నాయకులు ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## జాతిపితకు ఘన నివాళి



**మెళియాపుట్టి, అక్టోబరు 2(వార్త):** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మెళియాపుట్టిలో శుక్రవారం బీజేపీ సీనియర్ నేత డాక్టర్ సలాన శరత్‌కుమార్ నేతృత్వంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించడంతో పాటు,అంబేద్కర్ విగ్రహం పరిసరాల్లోనున్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి పరిశుభ్రం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ముగ్గురు పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముని ఆశయాలు సాధిద్దాం



**పాతపట్నం, అక్టోబరు 2 (వార్త):** జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను సాధిద్దాం అంటూ వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ అన్నారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా కోర్టు కూడలి వద్ద గల గాంధీ విగ్రహానికి స్థానిక వైసిపి శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశంలో హింసవాదాన్ని నిర్మూలించి, ప్రతి ఒక్కరూ అహింస బాటలో మహాత్ముని యొక్క మార్గం అనుసరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఏనుగుతల సూర్యం, పణుకు మోహన్ రావు, మాజీ జెడ్పిటిసి ప్రతినిధి జెన్ని అప్పన్న, చింతాడ త్రినాధరావు, మజ్జి తిరుపతిరావు, టంకాల సుధాకర్, పోత్రకండి ధనుంజయ రావు, పోలుబోతు బుడ్డు, కంటుభుక్త గోపి, బొంగు శ్రీరాములు, పిన్నింటి ఫాల్గుణరావు, తలగాపు సింహాద్రి, సోమేశ్వరరావు, పైల కిరణ్ కుమార్, పిన్నింటి లక్ష్మణరావు, ఎన్ని పురుషోత్తం, వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో అరుణోదయ ప్రతిభ



**పాతపట్నం, అక్టోబరు 2 (వార్త):** వేదం ఇంటర్నేషనల్ ఏఐ అకాడమీ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో శుక్రవారం కళింగపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాతపట్నం మండలం కొరసవాడ అరుణోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో అరుణోదయ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి ప్రశాంత్ సాహూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకోగా, అదే తరగతికి చెందిన సవిరిగాన సౌజన్య కుమార్ ద్వితీయ స్థానం, 9వ తరగతి విద్యార్థి చౌదరి హేమంత్ తృతీయ స్థానం సాధించారు. అలాగే 8వ తరగతి విద్యార్థి ఇల్లా హేమంత సాయి కన్సోలేషన్ బహుమతిని గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో ఘన విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జి.విజయ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభ వెనుక కృషి చేసిన ఉపాధ్యాయుల బోధనాపటిమను పలువురు కొనియాడారు.

## మహాత్ముని ఆశయాలే స్ఫూర్తి

**కంచిలి, అక్టోబరు2 (వార్త):** మహాత్మా గాంధీ ఆశయాలే మనకి ఎప్పటికీ స్ఫూర్తి అని కంచిలి మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర మహా సంగ్రామంలో బ్రిటిష్ పాలకుల బానిస సంకెళ్ల నుంచి భారతీయులకు విముక్తి కల్పించడంలో శాంతియుత పోరాటం నడిపించి అందరికీ ఆదర్శంగా నిలిచిన మహాత్మా గాంధీ భారతీయుల హృదయాల్లో చిరస్మరణీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేత రావాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



**పాతపట్నం, అక్టోబరు 2(వార్త):** పాతపట్నంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గోవిందరావు గాంధీజీ , శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గం మరియు లాల్ బహదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ అందించిన సేవలను, అలాగే దేశ రక్షణ, అభివృద్ధిలో లాల్ బహదూర్ శాస్త్రి అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్ -- సేవా మేరా యోగదాన్' కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయ ప్రాంగణంలో కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గోవిందరావు మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు పచ్చని, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకు వినూత్న నిరసన

**సరుబుజ్జిలి, అక్టోబరు 2(వార్త):** జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ సరుబుజ్జిలి మండల జర్నలిస్టులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపు మేరకు గురువారం చిన్నకాగితపల్లి గ్రామ పాఠశాల ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి అందించి, గాంధీజీ చూపిన అహింసా మార్గంలో తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గిడుగు రామ్మూర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కూటికుప్పల తారకేశ్వరరావు మాట్లాడుతూ...జర్నలిస్టులు లేని ప్రజాస్వామ్యాన్ని ఊహించలేం. రాత్రి పగలు తేడా లేకుండా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు, సంక్షేమ నిధి వంటి మా న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి గారు వెంటనే నెరవేర్చాలి. గాంధీజీ సత్యమేవ జయతే అని చెప్పారు, మా డిమాండ్లు కూడా సత్యమైనవే, తప్పకుండా నెరవేరుతాయని నమ్ముతున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలోప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ అసిరినాయుడు, కోశాధికారి అన్నం దొర, కూన సంజీవరావు, కుటి కుప్పల కోటేశ్వరరావు, కూన వరహానాయుడు, సీపాన తవిటినాయుడు, సీపాన లక్ష్మణరావు, తదితర గ్రామీణ పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.



## వాడవాడలా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు



**ఇచ్ఛాపురం, అక్టోబరు 2 (వార్త):** జాతి పిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి వేడుకలు వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ గాంధీ పార్క్ ఆవరణలో గాంధీ విగ్రహానికి కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పత్రి తవిటయ్య పాల్గొన్నారు. బెల్లుపడ గాంధీ విగ్రహం వద్ద మండల టిడిపి అధ్యక్షులు లోపింటి పద్మ నాభం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గిరి బాలరాజు మాధవరావు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ధర్మపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ విశ్వనాధ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈదుపురంలో అంగిర్ బెహరా ఆధ్వర్యంలో నిర్వహించారు. బిజెపి ఆధ్వర్యంలో గాంధీ,లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వల్లంపాటి కృష్ణ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు సాలిన ఢిల్లీ రావు పాల్గొన్నారు. షటిల్ టీమ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో జనార్దన్ రెడ్డి, ఇసురు ధర్మ, ఉప్పాడ ఢిల్లీ, కుండల రాజేష్ తదితరులు పాల్గొన్నారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యువ సూర్య సారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం రాంబాబు, జీఎస్ ఫౌండేషన్ అధ్యక్షులు అనుపానం శ్రీరామ్, పాతిర్ల గిరిబాబు రెడ్డి గాంధీజీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి గాంధీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య,రాష్ట్ర కార్యదర్శి నరేందర్ యాదవ్ మాజీ ఎంపీపీ బోర పుష్ప, కాళ్ల సత్య రాజు యాదవ్, చాట్ల లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు. డొంకురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సిహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. గాంధీ పార్క్ లో బిజెపి నాయకులు తరుణ్ మంగి లక్ష్మి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.



## బస్సులో బంగారం కోల్పోయిన మహిళ



**మందస, అక్టోబరు 2(వార్త):** కుమారుడి వివాహం కోసం బంగారం కొనుగోలు చేసి, వస్తుండగా దురదృష్టవశాత్తూ ఆ బంగారం కోల్పోయిన మహిళ ఉదంతమిది. సుమారు రూ.3లక్షల 50వేలు విలువ చేసే బంగారు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యవంతమవుతోంది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని బాలిగాం గ్రామానికి చెందిన ఇమ్మిడిశెట్టి దమయంతి కుమారుడి పెళ్లి అవసరాల నిమిత్తం కొనుగోలు రూ.3,50,000 విలువ చేసిన సుమారు 26 గ్రాములు బంగారం బంగారాన్ని కొనుగోలు చేసింది. సోంపేట నుండి హరిపురం బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో బంగారం జారి పడిపోయింది. దీంతో ఆమె నివ్వెరపోయింది. బస్సులోని ప్రయాణీకులకు ఎవరికైనా దొరికినచో దయచేసి బాధితురాలికి అందజేయాలని వారు కోరారు. లేదా 8985484033 నెంబర్ కు తెలియజేయాలని బాధితులు కోరుతున్నారు. పేద కుటుంబం కావడంతో బంగారం దొరికిన వారు మానవత్వంతో స్పందించాలన్నారు. వివాహం కావడంతో ఆనందంగా ఉన్న ఆ కుటుంబంలో లక్షలాది రూపాయల బంగారం కోల్పోవడంతో కన్నీటి పర్యవంతమవుతోంది.




## వన్య ప్రాణులను సంరక్షించుకోవాలి



**మందస, అక్టోబరు 2(వార్త):** వన్య ప్రాణులను సంరక్షించుకోవాలని కాశీబుగ్గ రేంజ్ అధికారి పి.అమ్మన్నాయుడు అన్నారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీలో గల రాధాకృష్ణపురం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో శుక్రవారం వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను ప్రతీ ఒక్కరూ రక్షించుకోవాలని, మొక్కలు నాటి.. పెంచి పెద్ద చేయాలని కోరారు. విద్యార్థి దశ నుంచి ప్రకృతిని ప్రేమించాలని, ప్రతీ ఒక్కరికీ మొక్కలు, పచ్చదనం ఆవశ్యకత చెప్పాలన్నారు. అడవులలో ఉన్న జంతువులకు హాని కలిగించవద్దని పిలుపునిచ్చారు. అనంతరం వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.అమ్మన్నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి టి.దేవరాజు, గురుకులం ప్రిన్సిపల్ పైల గణపతిరావు, ఫారెస్ట్ బీట్ అధికారులు పి.లక్ష్మణమూర్తి, టి.వెంకటేశ్వరరావు, జోగారావు, దుర్గాదేవి, భానుమూర్తి, రవికుమార్, సురేష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ మార్గమే అనుసరణీయం

**మందస, అక్టోబరు 2(వార్త):** మహాత్మాగాంధీ మార్గమే అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో జాతిపిత మహాత్మాగాంధీ 157వ జయంతి వేడుకలు నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, గాంధీజీ చూపిన సత్యం, అహింస, సహనం, శాంతి మార్గాలు నేటి ఆధునిక సమాజానికి, రాబోయే తరాలకు ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. బ్రిటిష్ వారి ఉక్కుపాదాల్ని సైతం శాంతియుత పోరాటంతో ఎదుర్కొని దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం పట్టకుండా కేవలం ఆత్మస్థైర్యంతో, అహింసా మార్గంలో విజయం సాధించిన అరుదైన నాయకుడు మన జాతిపిత అని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొంతలకోటి యతిరాజు, మాజీ ఎంపీటీసీ బైరిసెట్టి గున్నయ్య, బీజేపీ నాయకుడు రౌతు చిరంజీవరావు, హరిపురం సీహెచ్సీ కమిటీ మెంబర్ ఏర్పుల జోగారావు, హాస్పిటల్ మాజీ చైర్మన్ పుల్లా వాసుదేవు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఇచ్ఛాపురం, అక్టోబరు 2 (వార్త):** రాష్ట్ర స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగుల ఐక్య వేదిక పిలుపు మేరకు బుర్జపాడు స్వర్ణ గ్రామ పంచాయతీలో ఉద్యోగులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రెండు సంవత్సరాల ఇంక్రిమెంట్లను వెంటనే మంజూరు చేయాలని, ప్రొబేషన్ ఆలస్యమైన 9 నెలల కాలానికి సంబంధించిన బకాయిలను చెల్లించాలని, ప్రొబేషన్ ఆలస్యమైన కాలానికి ఒక వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఉద్యోగులు కోరారు. అలాగే ప్రతి ఉద్యోగికి రూ.30 వేల కంటే తక్కువ కాకుండా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జి వో .11ను వెంటనే రద్దు చేయాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను మూడు నెలల్లోపు అందించి, అర్హులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉద్యోగ సంఘాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉద్యోగులపై పెరుగుతున్న అదనపు పనిభారాన్ని తగ్గించాలని, ఉద్యోగులపై అదనపు డిపార్ట్‌మెంటల్ పనులను వెంటనే రద్దు చేయాలని కోరారు. బి ఎల్ వో విధులను సచివాలయ ఉద్యోగులకు మాత్రమే కాకుండా ఇతర శాఖల ఉద్యోగులకు కూడా సమానంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై ప్రభుత్వం తీసుకున్న ఉద్యోగ, సేవా సంబంధిత నిర్ణయాలను పునఃసమీక్షించి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని ఉద్యోగులు కోరారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తక్షణమే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా బుర్జపాడు



స్వర్ణ గ్రామ పంచాయతీ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ కోఆర్డినేటర్ పొల్లాయి అశోక్, డివిజన్ కోఆర్డినేటర్ కె.చిన్న రావు, పోరెడ్డి సంతోష్, శారద పాడి, ఉప్పిలి జయమ్మ, పుష్పలత లోట్ల తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



**నరసన్నపేట, అక్టోబరు 2 (వార్త):** నరసన్నపేట పట్టణంలో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంపై అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమస్యకు తక్షణ పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరత పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి సమస్యకే పరిమితం కాకుండా ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. గ్రామసభలో ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీ.ఈ.సీ ని తొలగించాలి: వామపక్షాల నిరసన



**శ్రీకాకుళం, అక్టోబరు 2 (వార్త):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల హక్కులను పరిరక్షించడంతో పాటు రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ ా×= ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో తొలగించారని ఆరోపిస్తున్న సుమారు 13 కోట్ల ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్‌తో పాటు పలువురు వామపక్ష నాయకులు మాట్లాడుతూ ఎన్నికల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడ్డాయని పలు వర్గాలు పేర్కొంటుండగా, ఈ అంశంపై రాజకీయపరంగా తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం ఇప్పటికే తొలగించబడిన లేదా జాబితాలో చేరకుండా మిగిలిన అర్హులైన ఓటర్లను గుర్తించి తిరిగి చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ డిమాండ్లను వ్యక్తం చేశారు.

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- నరసన్నపేటలో విస్తృతంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే రమణమూర్తి
- నాటిన మొక్కలను సంరక్షించడంపై అవగాహన
- పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని సూచన

**నరసన్నపేట, అక్టోబరు 2 (వార్త):** వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట పట్టణంలో శుక్రవారం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సేవా మేరా యోగదాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, సంరక్షణ చర్యలు చేపట్టి అవి వృక్షాలుగా ఎదిగేలా చూడాలని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు స్థానికులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సమాజంలో మానవీయ విలువలు కలిగి ఉండాలి



**మందస, అక్టోబరు 2(వార్త):** సమాజంలో మానవీయ విలువలు కలిగి ఉండాలని ప్రజా విజ్ఞాన వేదిక, ప్రజా విజ్ఞాన సాహితీ కళావేదిక నాయకులు అన్నారు. మందస మండలంలోని బాలిగాం జంక్షన్ లో గల ఆదిత్యా డిగ్రీ కళాశాలలో ఉపన్యాసాల పోటీలు మార్పు జగన్మోహనరావు అధ్యక్షతన జరిగింది. ప్రజా విజ్ఞాన వేదిక, ప్రజా విజ్ఞాన సాహితీ కళావేదిక సంయుక్తంగా గాంధీ జయంతి సందర్భంగా సమాజములో మానవీయ విలువలు దానిపై మీ పరిశీలన అనే అంశంపై న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ రచయిత మామిడి కోదండరావు, కవి, రచయిత సవర సోములయ్య, సామాజిక కార్యకర్త పులారి దుర్యోధన వ్యవహరించారు. ఆదిత్యా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్ కుమార్ పరిశీలనకర్తగా వ్యవహరించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు(హరిపురం) మాట్లాడుతూ కలియుగం కాదని కార్పొరేట్ యుగం నడుస్తుందని చమత్కరించారు. తనకు ప్రథమ బహుమతి దక్కిందని, ఎస్.చందు(బీఆర్సీపురం)విద్యార్థికి ద్వితీయ బహుమతి, బి.దుర్గాప్రసాద్(కవిటి) తృతీయ బహుమతి దక్కిందని తెలిపారు. వీరిని ప్రజావిజ్ఞాన వేదిక, సాహిత్య కళా వేదిక సభ్యులు దుశ్శాలువాలతో సన్మానం చేసి, మెమెంటోలు అందించి, విలువలతో కూడిన మూడు పుస్తకాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో నల్ల హడ్డి, కొర్నాన ఉమాపతి, దేవాడ నారాయణరావు, దువ్వాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



**ఇచ్ఛాపురం, అక్టోబరు 2 (వార్త):** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనుబంధ శాఖ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ ఇచ్ఛాపురం నియోజకవర్గ కార్యవర్గం గాంధీజీకి వినతిపత్రం అందజేసారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు.

జర్నలిస్టులు భౌతిక దాడులు, అక్రమ నిర్బంధాలు, ఆన్‌లైన్ వేధింపులు, వ్యవస్థాగత బెదిరింపులకు గురవుతున్న నేపథ్యంలో వారికి భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, సంస్థలకు రక్షణ కల్పించేలా ప్రత్యేక జర్నలిస్టుల భద్రతా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని కోరారు.వర్కింగ్ జర్నలిస్టులకు గతంలో చట్టాల ద్వారా కల్పించిన హక్కులు, రక్షణలను పునరుద్ధరించాలని కోరారు. 1955 నాటి వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, 1958 నాటి వేతన రేట్ల నిర్ణయ చట్టం ద్వారా కల్పించిన ప్రత్యేక రక్షణలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేసారు.

మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ప్రింట్, బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా సిబ్బందికి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా న్యాయమైన వేతనాలు సిఫార్సు చేసేలా వేజ్ బోర్డును నియమించాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ సమర్థంగా అమలయ్యేలా జర్నలిస్టు ప్రతినిధులతో త్రైపాక్షిక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ పథకాన్ని రాష్ట్రంలో పునఃప్రారంభించాలని డిమాండ్ చేసారు.

కూటమి ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ పాత్రికేయులకు పింఛను ఇవ్వాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు అమల్లో ఉన్న 50 శాతం రాయితీ రైలు ప్రయాణ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. స్వేచ్ఛాయుత, క్రియాశీలక, ఆర్థిక భద్రత కలిగిన పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలే మనకు మార్గదర్శకం

**నరసన్నపేట, అక్టోబరు 2 (వార్త):** జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సామాజిక సమరసత వంటి మహోన్నత విలువలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నరసన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంతో పాటు గ్రామాల అభివృద్ధి, స్వయం సమృద్ధి, సామాజిక సమానత్వానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఆయన కలలు కన్న 'గ్రామ స్వరాజ్యం' సాధించే దిశగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. గాంధీజీ బోధించిన శాంతి, అహింస, సత్యం వంటి విలువలను నిత్య జీవితంలో పాటిస్తూ సమాజంలో సోదరభావం, సామాజిక సమరసతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం

### షిరిడీ సాయిబాబా ధ్యానమందిరంలో నవంబరు 21న 25వ వార్షికోత్సవం



**పాతపట్నం, అక్టోబరు 2(వార్త):** పాతపట్నంలోని ఆల్ ఆంధ్రా రోడ్లో షిరిడీగిరిపై వెలసియున్న షిరిడీ సాయి బాబా ధ్యానమందిరంలో 25వ శంఖు స్థాపన వార్షికోత్సవం షిరిడి సాయిబాబా సేవాసంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 2026 అక్టోబరు 03 (శనివారం) ఉదయం 6 గంటల నుండి నవంబరు 21 ఉదయం 6 గంటల వరకు అనగా 7 వారాలు పాటు (49 రోజులు, 1176 గంటలు) "ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి" నామ సంకీర్తన నిర్విరామంగా కొనసాగుతుంది. నవంబరు 21 న సాయంత్రం బాబా వారి చిత్రపటం ఊరేగింపు (పల్లకీసేవ), 22న శ్రీ గాయత్రీ మహా యజ్ఞం, 23న ప్రముఖ గురుదేవులచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తులకు మహాన్నప్రసాదం వితరణ ఉంటుందని, ఈ పవిత్ర వేడుకల్లో భక్తులందరూ పాల్గొని బాబా వారి కృపాకటాక్షాలు పొందాలని శ్రీ షిరిడి సాయిబాబా సేవాసంఘం వారు కోరారు.

### ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



**ఇచ్ఛాపురం, అక్టోబరు 2 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి సమావేశం స్థానిక స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మైలిపిల్లి రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు గా త్రినాథ్ (99 టీవీ), అధ్యక్షులు గా సాలిన గణేష్ (ఐ న్యూస్), ఉపాధ్యక్షులు గా రాంబాబు (ఏబీఎన్ ఆంధ్రజ్యోతి), కార్యదర్శి గా కృష్ణతేజ (బిగ్ టీవీ), సహాయ కార్యదర్శి గా రాంబాబు (హెచ్ఎంటీవీ), ట్రెజరర్ గా రవిప్రసాద్ (10 టీవీ), కార్యవర్గ సభ్యులతో పాటు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, సామాజిక ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం ఎల్లప్పుడూ కృషి చేయాలని ప్రముఖులు ఆకాంక్షించారు.

### ఘనంగా జాతిపిత జయంతి



**సంతబొమ్మాళి, అక్టోబరు 2 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. నౌపడ సచివాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పావురాలను ఎగరవేసి శాంతి, అహింసకు ప్రతీకగా గాంధీజీ సందేశాన్ని స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరానికి అందించడంతో పాటు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, స్వచ్ఛత భావాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### భైరిసారంగపురంలో గ్రామసభ



**మందస, అక్టోబరు 2(వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురం సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గాంధీజయంతి సందర్భంగా ప్రత్యేకాధికారి బూరగాన రుషేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అంగూరు మనోహర్ గ్రామసభను జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు గ్రామసభలో చదవి వినిపించారు. గ్రామసభలో పంచాయతీలోని వివిధ సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పల్లెపండుగ 3.0కు సంబంధించి 3.0లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులను గుర్తించారు. పనులకు అంచనాలను తయారు చేయడం జరుగుతోందన్నారు. వీధిలో విద్యుత్ లైట్లు, శానిటైజేషన్ ఇంకా ఎవరైనా గ్రామస్తులు కొత్త పనులు గుర్తించినచో వాటిని కూడా తీర్మానంలో పొందుపరిచి ప్రభుత్వానికి పంపేలా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా కొత్త పనులపై అందరితో చర్చించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నవీన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వ్యాస్, తెలుగుదేశం పార్టీ నాయకులు బోర బుజ్జ, కడమటి పూర్ణ, మట్ట మాధవరావు, పోలాకి భాస్కరరావు, గొరకల జగ్గారావు, ఫీల్డ్ అసిస్టెంట్ జీరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ జయంతి

**సోంపేట, అక్టోబరు2 (వార్త ):** సోంపేట తహసిల్దార్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో మహాత్ముని విగ్రహానికి పూలమాలవేసి డిప్యూటీ తహసిల్దార్ మహేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్,రెవిన్యూ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమంలో మహాత్మా గాంధీతో పాటు ఇదే రోజు జయంతి జరుపుకుంటున్న లాల్ బహుదూర్ శాస్త్రి అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శనీయమని అన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం ఆగదు

- పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- కుసుమపోలవలసలో 'పేదల సేవలో 2.0' గ్రామసభ
- అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు
- రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ



**పోలాకి, అక్టోబ 1 (వార్త):** రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. పోలాకి మండలం కుసుమపోలవలస గ్రామంలో 'పేదల సేవలో 2.0' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 'తల్లికి వందనం', ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల సరఫరా, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, భద్రతా పెన్షన్లు తదితర పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పథకాలతో పాటు భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామసభల ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఎమ్మెల్యే అన్నారు. గ్రామస్థుల నుంచి స్వీకరించే అర్జీలను అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతమే లక్ష్యం

### -బైరిపురం జంక్షన్ వద్ద కార్యాలయం ప్రారంభం



**కంచిలి, అక్టోబరు 2(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఇచ్ఛాపురం నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర యాదవ్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి పేర్కొన్నారు. దేవదాస్ రెడ్డి ఆధ్వర్యంలో కంచిలి మండలానికి సంబంధించి పార్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని బైరిపురం జంక్షన్ వద్ద గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతిచోట పార్టీ తరపున పోటీ ఉంటుందని విజయవకాశాలు కూడా మెండుగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. అయినప్పటికీ పార్టీని మరింత బలోపేతం చేస్తూ 2029 లో రానున్న సాధారణ ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం లో గెలిచి వైయస్ జగన్ కు బహుమతిగా అందజేస్తామని పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నాయకులు నివాళు లర్పించారు. అలాగే వివిధ మండలాల నుంచి వచ్చిన మాజీ ప్రజాప్రతినిధులకు దుస్సాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయ రావు, సోంపేట మాజీ ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, ధర్మారావు, ఈశ్వరరావు వివిధ మండలాల మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్యకర్తలు హాజరయ్యారు.

## స్వతంత్ర ఉద్యమ నేతలకు ఘన నివాళులు



**సోంపేట, అక్టోబరు 2(వార్త):** స్వతంత్ర పోరాటంలో అలుపెరుగని కృషి చేస్తూ భారతీయుల స్వేచ్ఛ స్వాతంత్రాల కోసం అహర్నిశలు శ్రమించిన మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం బారువ గ్రామంలో బిజెపి ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి దున్న శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. వారి స్ఫూర్తి, ఆశయాలతో మనమంతా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సుజాత, భాస్కరరావు, చిన్నారావు, ఈశ్వరరావు, గోపి, లోకేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



**పలాస, అక్టోబరు 2 (వార్త):** జర్నలిస్టుల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, మీడియా కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు డి. మహరణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 'వర్కింగ్ జర్నలిస్టుల కోరికల దినం' సందర్భంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పలాస--కాశీబుగ్గ జర్నలిస్టులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహరణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా కార్యాచరణ చేపట్టాలని కోరారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక భద్రతా చట్టం తీసుకురావాలని, పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని అన్నారు. నూతన వేతన బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా పథకం పునరుద్ధరణ, ఆరోగ్య పథకం ద్వారా నగదు రహిత వైద్యం, జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు సీనియర్ జర్నలిస్టులకు పింఛను, రైల్వే రాయితీని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొంచాడ రవిశంకర్, పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్. నేతాజీ, కార్యదర్శి జయంత్‌కుమార్‌తో పాటు శర్వణ రవి రమేష్, సుభాష్ చంద్రబోస్, శంకర్, రవి, నంబాళ్ల రమేష్, రత్నాల రమేష్, వాసు, శ్రీను, సంతోష్, అశోక్, రాజగోపాల్ పాల్గొన్నారు.

## 8వ వార్డులో టీడీపీలో చేరిన వైసీపీ సభ్యులు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 2 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ లో వైస్సార్సీపీ కి గట్టి షాక్ తగిలింది. 8 వ వార్డు నుండి మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీ లో చేరారు.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెండాలం అశోక్ క్యాంపు కార్యాలయం లో అబ్జర్వర్ డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ సమక్షంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పత్రి తవి టయ్య ఆధ్వర్యంలో 4 వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రతినిధి సీనియర్ వైస్సార్సీపీ నాయకులు కుండల అప్పన్న ఇతర కార్యకర్తలు చేరారు.తెలుగుదేశం పార్టీలో సవాడ కూర్మారావు ఆనంద్ పతి (పులావ్ కొట్టు ఆనంద్ ) కుండల సురేష్, కుండల నరేష్, నిర్మల్ కుమార్ లు చేరారు. ఈ కార్యక్రమం లో నందిగామ కోటి కాళ్ల ధర్మారావు, ఆసి లీలా రాణి,రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి కాళ్ల దిలీప్, కాయ శ్రీను బచ్చు దొరబాబు రంగాల శ్రీను కృష్ణయ్య కొర్రాయి ధర్మరాజు, పూనా సంతోష్ సీపాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ మార్గంలో ప్రజా పోరాటం అవసరం



**పలాస, అక్టోబరు 2 (వార్త):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, సత్యాగ్రహ మార్గంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కాశీబుగ్గలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్ర చిరస్మరణీయమన్నారు. ఎంతో పోరాటంతో సాధించిన స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. విద్యుత్, ఆర్టీసీ ఛార్జీల పెంపు, నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం పడుతోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు భద్రత, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గాంధీజీ స్ఫూర్తితో ప్రజలంతా ఐక్యంగా ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, నాయకులు మొదలవలస మన్మథరావు, చింతాడ మాధవరావు, పైల వెంకటరమణ(చిట్టి), పీవీ సతీష్, మీసాల సురేష్, రోనంకి శ్రీనివాస్, కంచరాన చినబాబు, బమ్మిడి దుర్యోధనరావు, దున్న సత్యం, బోర చంద్రకళ, తూముల శ్రీనివాస్, బెల్లాల శ్రీనివాస్, మార్పు యుగంధర్, ఉంగసాయి కృష్ణయాదవ్, నర్తు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి



**నరసన్నపేట, అక్టోబరు 2 (వార్త):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ పార్క్‌లోని ఆయన విగ్రహానికి గురువారం ఘనంగా నివాళు లర్పించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ సత్యం, అహింసా సిద్ధాంతాలను ఆయుధాలుగా మలుచుకుని స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రజలను సమీకరించారని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చూపిన శాంతియుత మార్గం దేశ ప్రజలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. గాంధీజీతో పాటు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తదితర ప్రముఖుల సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం, సమాజ అభ్యున్నతి కోసం వారు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సామరస్య మార్గాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దేశెల్ల గోవింద మల్లిబాబు, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట్ల సింహాద్రినాయుడు, మాజీ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, సంయుక్త కార్యదర్శి గొంటి రామారావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకోట్ల లక్ష్మి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ బాషా, సరుబుజ్జిలి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి దాలయ్య, పలపాల రమేష్‌కుమార్, వేదాంతం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎన్ స్కూల్‌లో గాంధీ జయంతి

**జలుమూరు, అక్టోబరు 2 (వార్త):** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నరసన్నపేటలోని ఎంఎస్ఎన్ స్కూల్‌లో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ సత్యం, అహింస, శాంతి, ఐకమత్యం వంటి విలువలను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ విద్యపై శ్రద్ధ వహించాలని, నిత్య జీవితంలో సత్యాన్ని పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మంచి నడవడిక, క్రమశిక్షణ, సేవా భావంతో సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ సేవలను, దేశానికి ఆయన అందించిన స్ఫూర్తిని స్మరించుకున్నారు.



## గాంధీజీ ఆశయాలే సమాజ ప్రగతికి మార్గదర్శకం



**పలాస, అక్టోబరు 2 (వార్త):** సత్యాన్ని ఆయుధంగా, అహింసను మార్గంగా మలచుకొని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దిన మహాత్మా గాంధీజీ జీవితం యావత్ ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబురావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, సమానత్వం, స్వచ్ఛత, స్వావలంబన, సామాజిక సామరస్యం వంటి విలువలను గాంధీజీ జీవితాంతం ఆచరించారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమని ఆయన చాటిచెప్పారని ఉన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతికంగా దేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ గాంధీజీ బోధించిన నైతిక విలువల అవసరం మరింత ఉందన్నారు. నిజాయితీ, పారదర్శకత, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని సూచించారు. యువత గాంధీజీ జీవితం నుంచి క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, నైతిక విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. గాంధీజీని స్మరించుకోవడంతో పాటు ఆయన ఆశయాలను నిత్య జీవితంలో ఆచరించడమే నిజమైన నివాళి అని అన్నారు. సత్యం, అహింస, సేవా మార్గాలను స్ఫూర్తిగా తీసుకొని శాంతి, సోదరభావం, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వజ్జ బాబురావు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, లోడగల కామేష్, బడ్డ నాగరాజు, రవిశంకర్ గుప్తా, గోళ్ల చంద్రరావు, సాసుమాన చంద్రమౌళి, సవర రాంబాబుతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలే స్వచ్ఛ సమాజానికి మార్గం



**పలాస, అక్టోబరు 2 (వార్త):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కాశీబుగ్గలోని గాంధీజీ విగ్రహానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. దుర్గారావు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. దుర్గారావు మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. పట్టణాలు, గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు స్వచ్ఛతను సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, నందిగాం ధర్మారావు, తుంగాన దేవరాజు, సర్పవరపు ప్రదీప్, కింతల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీ రాజీనామా చేయాలి

**పలాస, అక్టోబరు 2 (వార్త):** ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శ్రీనివాస జంక్షన్, మూడు రోడ్ల కూడలి మీదుగా పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వామపక్ష నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించే చర్యలను నిలిపివేయాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, నిష్పాక్షికతపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన వారి ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి ప్రస్తుత విధానంలో మార్పులు చేసి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఎంపిక కమిటీ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రజాస్వామ్య పరిరక్షణకు వామపక్షాలు పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహనరావు, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాపర సుందరలాల్, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి టీ.సన్యాసిరావుతో పాటు పలువురు వామపక్ష నాయకులు, కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546